AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

19-9-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## మాణిక్ భవన్ పాఠశాల అభివృద్ధికి కృషి

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని మాణిక్ భవన్ పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవాపక్షంలో భాగంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గుప్తా ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు.





## నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీగా దయాకర్ గౌడ్


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దయాకర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఆయన జర్నలిస్ట్ ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం ఆయన 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం ఆయన టీపీసీసీ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. కాగా.. దయాకర్ గౌడ్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.

## శ్రీరాంసాగర్‌లోకి భారీగా వరద



**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో జలాశయం నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. మహారాష్ట్ర, స్థానికంగా కురుస్తున్న వర్షాలతో గోదావరికి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయంలోకి ప్రస్తుతం 3,68,226 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అధికారులు 12 వరద గేట్లను ఎత్తి 35,293 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 6,735 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా నాలుగు వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, సరస్వతి కాలువకు 400, లక్ష్మి కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా.. ఆవిరి రూపంలో 701 క్యూసెక్కుల నీరు పోతుంది. మొత్తం ఔట్ ఫ్లో 51,560 క్యూసెక్కులుగా ఉంది.

## నిజాంసాగర్ ప్రాజెక్టుకు..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 67,392 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అధికారులు వరద గేట్ల ద్వారా 61,038 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 17.022 టీఎంసీల నీరు ఉంది. నాగిరెడ్డిపేట మండంలోని పోచారం ప్రాజెక్ట్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వాగుల ద్వారా 2,388 క్యూసెక్కుల వరద వస్తోంది. 40 క్యూసెక్కులు ఆవిరి రూపంలో పోతుండగా మిగతా 2,348 క్యూసెక్కుల నీరు పొంగి పొర్లుతోంది.

**సీఎంఆర్ అప్పగించడంతో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం హెచ్చరిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయడానికి రైస్ మిల్లులకు ఇస్తోంది. ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. అయితే చాలా వరకు రైస్ మిల్లులు బియ్యం అప్పగించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. గడువు దాటినా బియ్యం ఇవ్వడం లేదు. ఇప్పటికీ రూ.కోట్ల సీఎంఆర్ బకాయిలు ప్రభుత్వానికి కట్టాల్సి ఉన్నా.. ఏమాత్రం స్పందించడం లేదు.**

**- అక్షరటుడే, ఇందూరు**



# సీఎంఆర్ వచ్చేనా!

▸ ప్రభుత్వానికి బియ్యం అప్పగించని రైస్‌మిల్లులు ▸ రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించాలని ఆదేశాలు ▸ అయినా పట్టించుకోని మిల్లర్లు

జిల్లాలో సీఎంఆర్ బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. సుమారు 48 మంది రైస్ మిల్లర్లు రూ.250 కోట్లు ప్రభుత్వానికి కట్టాల్సి ఉంది. అయితే వీరిలో కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో రికవరీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినా గత పదేళ్లుగా బకాయిలు ఉన్న రైస్ మిల్లర్లపై కేసులు నమోదవుతూనే ఉన్నాయి. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం బకాయిలను రికవరీ చేయాలని మంత్రులతో పాటు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ రికవరీ చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2024-25 వానకాలం సీజన్‌కు సంబంధించి 40 శాతం, యాసంగికి సంబంధించి 30 శాతం సీఎంఆర్ మాత్రమే ఇప్పటివరకు అందింది. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ రైస్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### చర్యలు కరువు

ప్రతి సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు కేటాయిస్తుంది. క్వింటాకు 67 కిలోల బియ్యం తిరిగి సీఎంఆర్ రూపంలో ప్రభుత్వానికి మిల్లర్లు అప్పగించాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం యాసంగికి సంబంధించిన సీఎంఆర్ ఇప్పటికీ కొందరు రైస్ మిల్లర్లు పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి ఇవ్వలేదు. పలుమార్లు గడువు పెంచి ఈ ఏడాది జూన్‌లోగా అప్పగించాలని చెప్పినా మిల్లర్లు పెడచెవిన పెట్టారు. రూ.కోట్లలో బకాయిలు ఉండడంతో ఇన్‌ఛార్జి మంత్రులు, కలెక్టర్ సైతం రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా రికవరీ చేయాల ఆదేశాలు ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేవు.

### పదేళ్ల నుంచి బకాయిలు

జిల్లాలోని పదుల సంఖ్యలో రైస్ మిల్లర్లు గత పదేళ్ల నుంచి సీఎంఆర్ బకాయిలు ఉన్నారు. 2014 - 15 నుంచి 2022 - 23 వరకు సుమారు 40 రైస్ మిల్లర్లు రూ. 200 కోట్లకు పైగా కట్టాల్సి ఉంది. హైకోర్టు ఆదేశాలతో కేసులు నమోదు చేసినా.. తదుపరి విచారణ చర్యల విషయంలో అధికారులు ముందుకు వెళ్లడం లేదు.

ఈ అంశంలో గతంలో అప్పటి జిల్లా పౌర సరఫరాల అధికారిపై సస్పెన్షన్ వేటు కూడా వేశారు. ఇదిలా ఉండగా బోధన్‌కు చెందిన మాజీ ప్రజా ప్రతినిధికి చెందిన నాలుగు రైస్ మిల్లులకు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఈ మిల్లులో ధాన్యాన్ని మిల్లింగ్ చేయకపోగా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం సుమారు రూ.10 కోట్ల జరిమానా కూడా విధించింది. ఇప్పటివరకు సీఎంఆర్ ఇవ్వకపోగా జరిమానా సైతం కట్టలేదు.

## వరదల సమయంలో హోంగార్డుల సేవలు మరువలేనివి: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాను వరదలు ముంచెత్తిన సమయంలో హోంగార్డుల సేవలు మరువలేనివని ఎస్పీ రాజేష్ చంద్ర ప్రశంసించారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పోలీసు సిబ్బందితో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా వరదలు ముంచెత్తాయన్నారు. ఆ సమయంలో పోలీస్ సిబ్బంది ప్రజలకు అండగా నిలిచారన్నారు. ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాహసం చేశారని కొనియాడారు. ఇదే స్ఫూర్తి మున్ముందు కొనసాగించాలని సూచించారు. నిజాయితీతో పనిచేసిన వారికి గుర్తింపు, గౌరవం ఎప్పుడు లభిస్తుందని, గుర్తింపుతో పాటు ఉత్తమ పనితీరుకు రివార్డులు లభిస్తాయని తెలిపారు. అనంతరం వర్షాల నేపథ్యంలో హోంగార్డులకు రెయిన్ కోట్స్, జెర్సీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



## దసరాకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు తీసుకోండి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** దసరా పండుగ సందర్భంగా సెలవుల్లో ఊళ్లకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కాలనీల్లో రాత్రివేళ్లలో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగివే వెంటనే వారిని ప్రశ్నించాలని సీపీ సూచించారు. శివారు ప్రాంత కాలనీల్లో తాళం వేసిన ఇళ్లను అపరిచిత వ్యక్తులు రెక్కీ నిర్వహించి రాత్రివేళల్లో చోరీలకు పాల్పడుతారని పేర్కొన్నారు. పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్తే ఇంటిపక్క వాళ్లకు సమాచారం ఇవ్వాలని.. వారిని ఓ కంట కనిపెట్టి ఉండేలా చూడమని చెప్పాలన్నారు. పక్కింటివాళ్ల ద్వారా సమాచారం తెలుసుకుంటూ ఉండాలని పేర్కొన్నారు. బయటకు వెళ్లినప్పుడు ఇంట్లో వృద్ధులు, మహిళలు ఉంటే అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఖరీదైన వస్తువులను ఇంట్లో ఉంచవద్దని వివరించారు. బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలన్నారు. తాళం వేసి ఊరు వెళ్లే సమయంలో సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ శాఖకు అనుమానిత వ్యక్తుల సమాచారం అందించి చోరీల నివారణకు సహకరించాలన్నారు.



## మెడికల్ షాప్‌లో అధికారుల తనిఖీ

**అక్షరటుడే, బాన్సువాడ:** నియోజకవర్గంలోని వర్ని మెడ్‌ప్లస్ మెడికల్‌లో మూడురోజుల క్రితం ఓఆర్ఎస్ ప్యాకెట్‌లో చెత్తచెదారం వచ్చింది. దీంతో బాధితులు జిల్లా మెడికల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా డ్రగ్స్ శాఖ అధికారులు సదరు మెడికల్ షాప్‌లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత ఆధ్వర్యంలో మెడికల్ షాప్‌లో మందుల ఎక్స్‌పైరీ తేదీలను, అలాగే ఇతర పదార్థాలను తనిఖీ చేశారు. వినియోగదారులు కొనుగోలు చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం పరిశీలించారు. అనంతరం అధికారిణి శ్రీలత మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు మేరకు మెడికల్ షాప్‌ను పూర్తిగా తనిఖీ చేశామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మెడికల్ షాప్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తనిఖీల్లో నిజామాబాద్ రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



## విద్యారంగంలో జిల్లా అభివృద్ధికి కృషి: పీసీసీ చీఫ్

**అక్షరటుడే, ఇందూరు:** విద్యారంగంలో జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. ట్రస్మా ఆధ్వర్యంలో నగరంలోని బృందావన్ గార్డెన్‌లో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ సంస్కృతిలో, అభివృద్ధిలో గురువులది అత్యున్నత స్థానం అని అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు భవిష్యత్తును ఇస్తారని కొనియాడారు. దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతో ఉంటుందన్నారు. చదువు లేనిదే భవిష్యత్తు లేదన్నారు.. గురువులు చదువుతో పాటు క్రమశిక్షణ, సమాజంలో ఎలా ఉండాలో చెబుతారని పేర్కొన్నారు. ట్రస్మా సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో ట్రస్మా ప్రతినిధులను మాట్లాడించే ప్రయత్నం చేస్తానన్నారు. ప్రధానంగా సీఎం రేవంత్ రెడ్డికి విద్యపై అపారమైన ప్రేమ ఉందన్నారు. అందుకే విద్యాశాఖను సీఎం చూస్తున్నారని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల తీసుకొచ్చామని అగ్రికల్చర్ కళాశాల మంజూరు చేశామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా జిల్లా వ్యక్తిని.. ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రైవేటు పాఠశాలల్లో బోధించే ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, డీఈవో అశోక్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, కోశాధికారి జయసింహా గౌడ్, జిల్లా అధ్యక్షుడు నిత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం..

### మున్సిపల్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో మున్సిపల్ సిబ్బందిపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్ అయ్యారు. తన ఆదేశాలను బేఖాతరు చేస్తూ పారిశుధ్య కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు మున్సిపల్ సిబ్బందికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి మున్సిపాలిటీలోని 15వ వార్డులోని వినాయకనగర్ కాలనీలో అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు ఇతర వాటిని అత్యవసరంగా పునరుద్ధరణ కోసం ఎస్డీఆర్ఎఫ్ కింద మంజూరు ఇచ్చిన పనులను వెంటనే పూర్తి చేయాలని గతంలో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అయితే తాను ఆదేశించినప్పటికీ శానిటేషన్ పనులు సక్రమంగా జరగకపోవడంతో కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే సంబంధిత ఏరియా సానిటరీ జవాన్‌తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్లకు 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని షో కాజ్ నోటీస్ జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజినీర్ తదితరులున్నారు.





## డైట్ కళాశాల విద్యార్థుల ధర్నా

**అక్షరటుడే, ఇందూరు:** తమ కళాశాల ముందు ఆర్టీసీ బస్సులు (రిక్వెస్ట్ స్టాప్) నిలపాలని డిమాండ్ చేస్తూ డైట్ విద్యార్థులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. తాము సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు వస్తామని, అయితే ఎక్స్‌ప్రెస్ బస్సులు కళాశాల ముందు నిలపడం లేదన్నారు. అలాగే కొన్ని పల్లెవెలుగు బస్సులు కూడా ఆనడం లేదంటూ వాపోయారు. కళాశాల దాటిన తర్వాత బస్‌స్టాప్‌లో నిలపడంతో నడుచుకుంటూ వచ్చేసరికి ఆలస్యం అవుతోందన్నారు. దీంతో అటెండెన్స్ పడడం లేదని వివరించారు. ఈ విషయం ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని కళాశాల ముందూ రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా.. నిలపడం లేదని పేర్కొన్నారు. గత ఏడాది నుంచి ఇదే సమస్య నెలకొందన్నారు. మరోవైపు ధర్నా చేయడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు విద్యార్థులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో వారు వెనుతిరిగారు. డైట్ కళాశాల సమయం 9.45 గంటలకు ప్రారంభమవుతుంది. అయితే చాలామంది విద్యార్థులు ఇతర గ్రామాలు, మండలాల నుంచి హాజరవుతుంటారు. ఆర్టీసీ బస్సులు కళాశాల ముందు కాకుండా నాగారం చౌరస్తాలో నిలపడంతో సుమారు 300 మీటర్లు నడవాల్సి ఉంటుంది. దీంతో వారి సమయం 15 నుంచి 20 నిమిషాల ఆలస్యమవుతోంది. దీని కారణంగా అటెండెన్స్ కోల్పోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.



## లంబాడా నాయకుల అరెస్ట్..

**అక్షరటుడే, కామారెడ్డి:** లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులను పోలీసులు ఉదయం అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో శుక్రవారం జరుగనున్న లంబాడీల ఆత్మ గౌరవ సభకు వెళ్లేందుకు సిద్ధమైన సమితి నాయకులను ముందుస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేష్ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ వినోద్ నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా లీగల్ ఛైర్మన్ మాలోత్ జబ్బర్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బద్రినాయక్, టౌన్ అధ్యక్షుడు మోహన్ నాయక్, తాడ్వాయి మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ ఉన్నారు. అరెస్ట్ చేసిన వారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా గణేష్ నాయక్ మాట్లాడుతూ.. తాము శాంతియుతంగా సభ విజయవంతం చేయడానికి వెళ్తుంటే అక్రమ అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఎన్ని అరెస్ట్‌లు చేసినా తమ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. అనంతరం ఎల్లారెడ్డి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీద్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో బార్ అసోసియేషన్ ఈసీ సభ్యుడు తన్నీరు శ్రీకాంత్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల దాడి చేశారన్నారు. ఈ దాడిని నిరసిస్తూ తాము విధులను బహిష్కరించినట్లు తెలిపారు. తెలంగాణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరించామని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు నవీద్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో న్యాయవాదిపై దాడులు చేసిన వారికి కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు ఈ సందర్భంగా కోరారు. నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



## ధ్వంసమైన వంతెనలకు మరమ్మతులు చేయించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వర్షాల కారణంగా ధ్వంసమైన వంతెనలకు మరమ్మతులు చేయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ నివాసంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి విపత్తు కారణంగా ఎంతోమంది రైతులు నష్టపోయారన్నారు. అలాగే వందలమంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నుండి మెదక్, బాన్సువాడ, కామారెడ్డి, నిజాంసాగర్ దారులన్నీ నీటితో మునిగిపోవడంతో రవాణా పూర్తిగా స్పందించిందని వివరించారు. దీనివల్ల ప్రజలకు తీవ్ర ఆస్తి నష్టం జరిగిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టలేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నర్సింలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు సాయిలు, శ్రవణ్ కుమార్, ఇమ్రాన్, అరవింద్ గౌడ్, రాజయ్య సొసైటీ డైరెక్టర్లు దేవదాస్, అరవింద్ గౌడ్, నాయకులు దయాకర్, బబ్లు పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



బాన్సువాడ మండలంలో మొరం మాఫియా రెచ్చిపోతోంది. ఇష్టారీతిన సాగర్ ప్రధాన కాలువ వెంబడి తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రివేళల్లో జేసీబీలతో తవ్వేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్లలో అక్రమంగా మొరం తరలించుకుపోతున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ, అక్రమార్కులు రూ.లక్షలు గడిస్తున్నారు.

- అక్షరటుడే, బాన్సువాడ



# రెచ్చిపోతున్న మొరం మాఫియా..

▸ యథేచ్ఛగా నిజాంసాగర్ ప్రధాన కాలువ తవ్వకం ▸ పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్ ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టు పరిధిలో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. సాగర్ ప్రధాన కాలువ కట్టలపై అక్రమార్కుల కన్ను పడింది. నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్ నుంచి బొమ్మన్‌దేవ్ పల్లికి వెళ్లే సాగర్ ప్రధాన కాలువ కట్టలపై నుంచి రాత్రి వేళల్లో జేసీబీలు, ట్రాక్టర్లు వినియోగించి మట్టిని తవ్వేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న రైస్‌మిల్లు నిర్మాణాలకు తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇలా ఇష్టారీతిన కాలువ కట్ట తవ్వకాలతో కట్ట భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.

### అధికారుల నిర్లక్ష్యం..

సాగర్ ప్రధాన కాలువ కట్టలు ప్రాజెక్టుకు రక్షణగా ఉన్నాయి. వీటిని కాపాడకపోతే వర్షాకాలంలో వచ్చే నీటి ఒత్తిడికి కట్టలు బీటలు వారే ప్రమాదం ఉంటుంది. అలాగే కట్టకు గండిపడితే వందల ఎకరాల్లో పంటలు నీట మునగడంతో పాటు గ్రామాల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. గ్రామస్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఇరిగేషన్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కట్టపై అక్రమ తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### విచారణ చేయించాం..

హాజీపూర్ సాగర్ ప్రధాన కాలువ కట్ట పైనుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న విషయం దృష్టికి వచ్చింది. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో విచారణ జరిపించాం. కట్టపై మొరం తవ్వకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రణయ్, ఏఈఈ

## సీజనల్ వ్యాధులపై అవగాహన



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని కాకతీయ హైస్కూల్‌లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్య బోధకులు గన్‌పూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు సదస్సు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల గురించి విద్యార్థులకు వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, కలుషిత నీరు, ఆహారం తీసుకోవద్దన్నారు. పౌష్టికాహారం, తీసుకోవడంతోపాటు క్రమం తప్పకుండా ఆటలు, వ్యాయామం, యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నటరాజ్, ఇన్‌చార్జి అనంత్, హెచ్‌ఈఓ లింబారెడ్డి, ఆరోగ్య కార్యకర్త ఉష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** పిట్లంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అనుమతి లేకుండా నడుపుతున్నారని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరుతో తల్లిదండ్రులను, విద్యాశాఖ అధికారులను మోసం చేస్తున్న యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌యూ అధ్యక్షుడు బోడ అనిల్, డీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్, నందు పాల్గొన్నారు.

## ఇందూర్ ప్రైమరీ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని రాకాసిపేట్‌లో గల ఇందూర్ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా టీచర్లు అందమైన బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ ఆడారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరైన పలువురు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. నేటి తరం విద్యార్థులకు తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మ గురించి తెలిసేలా ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, కరస్పాండెంట్ కొడాలి కిషోర్, వై శ్రీనివాస్, బోధన్ ప్రైవేట్ విద్యా సంస్థల పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ పాల్గొన్నారు.





## విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్ :** మండలంలోని అంకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ దివంగత గడ్డం రాజన్న జ్ఞాపకార్థం అమెరికాలో నివాసముంటున్న ఆయన కుమారుడు రమేశ్‌రెడ్డి తన తల్లి లక్ష్మి చేతుల మీదుగా వంద మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన వెల్డర్ ప్రసాద్ దేశ నాయకుల చిత్రపటాలను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య, రాజన్న సోదరుడు గడ్డం చిన్న రాజన్న, వీడీసీ సభ్యులు గంగారెడ్డి, జంగం మురళి, వినోద్ రెడ్డి, నాగరాజు, రాజన్న కుటుంబ సభ్యులు రాజారెడ్డి, రాజలింగం, నర్సారెడ్డి, రత్న, ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళలకు వైద్య పరీక్షలు



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని హన్మాజిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో జనరల్ ఫిజీషియన్ మన్నె సాయిలు షుగర్, బీపీ, థైరాయిడ్, జ్వరంతో పాటు సాధారణ సంబంధిత వ్యాధులపై మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన రక్త పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పాప, ఫార్మసిస్ట్ లక్ష్మణ్, ల్యాబ్ టెక్నీషియన్ పండరి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని వన్‌టౌన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈనెల 6న గంజ్ మార్కెట్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని అతన్ని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వయస్సు 55 -60 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై బూడిద రంగు బనియన్, క్రీమ్ కలర్ ప్యాంటు ధరించినట్లు చెప్పారు. సంబంధీకులు ఉంటే, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## 21 వరకు తాళ్లరాంపూర్‌లో 144 సెక్షన్ అమలు

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో ఈ నెల 21 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు. గ్రామంలో ఇటీవల వీడీసీ, గౌడ కులస్తుల మధ్య వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. ఈత చెట్లను నరికివేయడంతో గొడవ మొదలైంది. దీంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకునే అవకాశం ఉండడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి గొడవలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. గ్రామంలో సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టొద్దని పోలీసులు హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు, గుమిగూడి ఉండడం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామంలోని ప్రధాన కూడళ్లలో భారీగా పోలీసులు మోహరించారు.

## రైలులో తరలిస్తున్న నల్లబెల్లం, పటిక పట్టివేత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రైలులో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌పీఎఫ్ నిజామాబాద్ 'ఆపరేషన్ సతార్క్' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే రైళ్లను శుక్రవారం తనిఖీ చేశారు. దీంట్లో భాగంగా రైలులో అక్రమంగా తరలిస్తున్న 35 సంచుల నల్లబెల్లం, పటిక గుర్తించి పట్టుకున్నారు. అయితే ఎవరు తరలిస్తున్నారనేది వెల్లడి కాలేదు. ఈ సంచులను క్లెయిమ్ చేసుకునేందుకు ఎవరూ రాలేదు. 2 వేల కిలోల నల్లబెల్లం విలువ సుమారు రూ. 8లక్షలు ఉంటుందని.. 200 కిలోల పటిక విలువ రూ. 40వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తామని రైల్వే పోలీసులు తెలిపారు.




## తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్



**అక్షరటుడే, కోటగిరి:** కోటగిరి తహశీల్దార్ కార్యాలయాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా 22-ఎ రిజిస్టర్ నవీకరణపై సమీక్షించారు. మిగిలిన గ్రామాల్లో నవీకరణ త్వరగా పూర్తి చేయాలని తహశీల్దార్ గంగాధర్‌కు సూచించారు. సాదాబైనామా కేసులకు సంబంధించి విజయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2014 జూన్ 2వ తేదీకి ముందు జరిగిన, నమోదు కానీ లావాదేవీలు, అంటే 12 ఏళ్లకుపైబడి స్వాధీనంలో ఉన్న వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. విక్రేత పేరు పహాణి/ధరణి రికార్డుల్లో కనిపించాలని, దరఖాస్తుదారు నిరంతర స్వాధీనంలో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## సిర్నాపల్లిలో ఉచిత ఆరోగ్య శిబిరం




**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని సిర్నాపల్లిలో సూర్య ఆరోగ్య సంస్థ సహకారంతో శుక్రవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్థులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో 14 మందికి డెంగీ పరీక్షలు చేశారు. అయితే, అందరికీ నెగిటివ్ వచ్చినట్లు వైద్యులు పేర్కొన్నారు. హెచ్‌ఈవో శంకర్ మాట్లాడుతూ.. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించాలని, దోమలు లార్వా వృద్ధి చెందకుండా టెమోఫాస్ స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అక్బర్ ఆలీ, సూర్య ఆరోగ్య సంస్థ కో-ఆర్డినేటర్ వినోద్, ఎంఎల్‌హెచ్‌పీలు కావ్య, లేయా, ఆరోగ్య కార్యకర్త సంతోషి, ఆశా కార్యకర్తలు భాగ్య, పుష్ప, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.